అని బయటికి నడిచాడు. డాక్టరు వెనకాలే సబిన్స్పెక్టరుకూడా బయటికి వెళ్లాడు.

ఆరు నెలలు సెలవు పెట్టి, ఆ సబిన్స్పెక్టరు ఇంటికి వెళ్లాడు.

———

# 18. మాణిక్యం

పల్లెటూరి కాపురంలో పాటుపడి రోజులు వెళ్ళదీసే కాపు కుటుంబాలలో సుబ్బన్న కుటుంబంకూడా చెప్పతగ్గదే. కుటుంబమంటే, పాతిక యిరవైమంది లేరు. సుబ్బన్నా, పెళ్లాం మాణిక్యమూ, ఆరేళ్ల కొడుకూను. ఓర్పుకీ, పెద్దమనిషితనానికీ, సాటి కుటుంబాలలో మాణిక్యాన్ని ఉదాహరణంగా తీసుకునేవారు. చుక్క పొడవడంతోటే నిద్ర లేచి, కొంచెం పుల్లనీళ్లూ అన్నమూపెట్టి మొగుణ్ణి పొలానికి పంపించి, యెద్దుల గాటి దగ్గర పేడా, దంటూ యెత్తి శుభ్రంచేసుకొని యిల్లూ దొడ్డీ వూడ్చి, కలాపి చల్లుకొని, చల్ల చిలికి నోట్లో బొగ్గు వేసికొని దంతధావన ఆరంభించేసరికి సాగదీసుకుంటూ కొడుకు నిద్ర లేచేవాడు; తనతోపాటు వాడికికూడా మొహం కడిగి, కవ్వం దగ్గిర చల్లతోటీ, పెల్లుల్లికారంతోటీ వాడికి చద్దిపెట్టి తను తినేప్పటికి బారెడున్నర పొద్దెక్కేది. గబగబా రెండు గేదెలకీ, చిట్టూ తవుడూ పెట్టి, కడుపునిండా నీళ్ళు పట్టి, నాలుగు దుత్తల పాలూ తీసి, పిడకల దాలిమీద పడేసి, వంట ఆరంభించేది. పొద్దు నడినెత్తిమీదికి వచ్చేటప్పటికి బువ్వమూటా నీటి దుత్తా పట్టుకొని, అప్పుడే యెద్దుల మెడమీద కాడి దించి తనకోసం యెదురుచూస్తూ వేపచెట్టు నీడన కూర్చునే సుబ్బన్నని చేరుకొనేది. సుబ్బన్న దుత్తా, మూటా అందుకొని ఆరగించేసరికి, తారాజువ్వలాగ కొడవలితో మోపెడు చొప్పకోసి కట్ట కట్టుకొనేది. లెక్కకి నాలుగు నిమిషాలు, ఊళ్ళోసంగతులు విమర్శనలతో సహా మాట్లాడుకొనేవారు

ఆ దంపతులు. గడ్డిమోపు నెత్తిన బెట్టుకొని, దుత్త చేత్తో పట్టుకొని, యెకాయెకి యిల్లుచేరి, నిద్రబోతూన్న పిల్లాడిని లేపి, వాడికి అన్నం పెట్టి, తనుదినీ, మళ్ళా యిల్లూ వాకిలీ శుభ్రం చేసుకొని, కొప్పుదువ్వి దొడ్లోపూసిన బంతిపూలో, ఏ చంద్రకాంతం పూలో కొప్పులో తురిమి, పిల్లాడికి వేణ్ణీళ్లు కాచిపోసి, తను నీళ్లు పోసుకొని, సాయంత్రపు వంట అరంభించేసరికి, మోపెడు నాము నెత్తిన బెట్టుకొని; యెద్దుల్ని తోలుకొని, సుబ్బన్న ఇంటికి వచ్చేవాడు. నాము తెగగొట్టి, యెద్దులగాట్లో వేసి, యెద్దులకి వేణ్ణీళ్ళతో వొళ్ళు కడిగి, తను నీళ్ళు పోసుకొని, చుట్ట కాలుస్తూ అరుబయట వెల్లకిలా వాల్చిన మంచంమీద పడుకొనేవాడు సుబ్బన్న. కొడుకు అన్నంతిని, తండ్రి ప్రక్కన జేరి, ఆ మాటా, ఈ మాటా చెపుతూ నిద్రపోయేవాడు. శిస్తులమాటా, ధరలమాటా, కరణం మునసబుల ఆనాటి చర్యలమాటా యెత్తుతూ రంగన్నా, రామన్నా వచ్చి కాసేపు మాట్లాడి వెళ్ళేవారు. అప్పుడులేచి భోజనంచేసేవాడు సుబ్బన్న. తను, అన్నం తిని, సామానులు సర్ది, పక్కవేసేది మాణిక్యం. పెరట్లో వేసిన పెద్ద మంచంమీద పడుకొని దంపతు లిద్దరూ మైమరచేవారు.

మాణిక్యం కాపురానికి వచ్చిన యేడేండ్లనుంచీ, యిదే వాళ్ళ దిన చర్య; సేద్యము, పనీ లేనికాలంలో, బందుగుల్ని చూడటానికీ, మ్రొక్కుబళ్ళు తీర్చుకోవడం కోసము, తిరునాళ్ళకీ వెళ్ళిరావడము. ఇలా ఏడాదీ గడిపేవారు. చీకూ, చింతా లేకుండా, ఏయేటి ఫలసాయంమీద ఆయేడు వెళ్ళదీస్తూ, సుబ్బన్నా, మాణిక్యమూ కాపురము చేసుకుంటున్నారు. ఓ త్రాగుడనీ, కోడిపందేలనీ కానిపోకిళ్లు పోయేవాడు కాదు సుబ్బన్న. సుబ్బన్న మనసుకి నచ్చిన భార్య మాణ్యిం.

శాంతంగా వెడుతూన్న రోజులలోనే తుపానువీస్తుంది కాబోసు!

రెండుమూడు నెలలనుంచీ, యేడేళ్లుగా ఒడుదొడుకులు లేకుండా సాగిన సంసారంలో బీభత్సం పుట్టింది. అకస్మాత్తుగానూ, అతి కల్లోలంగానూ గొడవ పుట్టింది. ఇరవై రోజులదాకా మాణిక్యానికి ఏమీ జాడ పొడగట్టలేదు. సుబ్బన్న ఇంటికి ఆలస్యంగా రావడమూ, ఏదో పరధ్యానంతో ఉండడమూకూడా అలవాటుపడిన దైనికచర్యల్లో ఆమె గమనించలేదు. ఉండబట్టలేని ఏ పొరుగు ఆవిడో అంది: "మాణిక్యం,

చిలకా గోరింకల్లాంటి మొగుడూ పెళ్ళాలు కనక చెపుతున్నా. మీది పేరుమోసిన కాపురం. సుబ్బన్న నాయన నారన్ననీ, అమ్మ కోటమ్మనీ నే నెరుగుదును. వాళ్ళు వేలుపెట్టి చూపించుకోలేదు. నువ్వు నిజంగా మాణిక్యానివి. సుబ్బన్నకూడా మంచోడే; మరోలాగనుకోకేం— సూరయ్యకూతురు-నాలుగునెల్లనాడు పెనిమిటిపోయాడు దానికి, ఇప్పుడు వచ్చి యిక్కడే పుట్టింట ఉంటోంది అదేమో — మందోమాకో పెట్టిందో—మైకం చల్లిందో—కాని చూడు మాణిక్యం, నేను చెప్పా వని గానీ అనేవు సుమీ; సుబ్బన్న మతి పాడుచేసింది ఆ ముండ; ముచ్చటగా చేసుకొనే నీ సంసారానికి అగ్గి రాసింది. ఊరంతా గుప్పు మంటోంది. అయిన ప్రాణమూ, ఆడ ప్రాణమూ గనక, ఉండ బట్టలేక ఇంటిమొగాణ్ణి దారికి తెచ్చుకుంటావని చెపుతున్నా. పున్నమ్మ నీతో చెప్దామని- మళ్ళీ అతగాడికి కోపమొస్తుందని వెనక్కి తగ్గింది. కాని, నా ప్రాణ మూరుకోదమ్మా!"

చల్లగా, తన చల్లని గుండెకి మంటలు తగిలించే ఈ ఉపన్యాసాన్ని, ఊపిరైనా పీల్చకుండా వింది మాణిక్యం. తను కాపురానికి వచ్చిన యేడేళ్ళు వొక్కసారి ఆమె కళ్ళముందు కనుపడ్డాయి. అంత సౌఖ్యంగా తనతో మెలిగిన సుబ్బన్న యిలా చేస్తున్నాడా! తను అందమైంది కాదూ!! సుబ్బన్నకి ఇలాంటి బుద్ధి పుట్టిందా? ఆలోచించిన కొద్దీ, ఆమెకి యీర్ష్య పెరిగిపోయింది. చెప్పడానికి సాధ్యంకాని ఆవేదన పుట్టింది. 'నిజమేనా! యేమో; ఇరవై రోజులాయె నా మొహామే చూడ్డంలేదు. కానిబుద్ధులు పుట్టాయి గామాలె అవరా! ఊరంతా గుప్పుమంటోందిట. వీరమ్మ చెప్పిందాకా నాకు ఆకళింపే లేదు. ఇంటి మగోణ్ణి కానిపోకిళ్ళు పోకుండా నిభాయించుకో లేకబోతే యేం బతుకు? ఛీ! ఇట్టా బుద్ధి పుట్టినవాడు, ఇంక నన్నూ, బిడ్డనీ కళ్ళజూస్తాడా?' ఈ మాట అనుకునేటప్పటికి దుఃఖం కెరటాలలాగ త్రెళ్ళుకొని వచ్చింది. మొహంమీద గుడ్డ గప్పుకొని, బావురుమని ఒక్కసారి యేడ్చింది. 'రానీ, అడుగుతా' అనుకొని నిత్యకృత్యాల్లోకి దిగింది.

బరువెక్కిన గుండెతో, మాణిక్యం పొయ్యిదగ్గర కూచుంది. కుండలో ఉడికే అన్నంతోపాటు, మాణిక్యం వొళ్ళుకూడా కుతకుత లాడి

పోతోంది. చెంపన చెయ్యి చేర్చుకొని, ఆలోచిస్తూ మధ్య నిట్టూర్పులు విడుస్తూ ఉత్సాహహీనంగా వుంది.

"అన్నమింకా వుడకలే?" అన్నాడు సుబ్బన్న, లోపలికి వచ్చి ద్వారబంధం రెండుచేతులతోటీ పట్టుకొని నిలుచుని. ఇరవై రోజుల నుంచి తను కనిపెట్టలేని మార్పు, మాణిక్యానికి అప్పుడు సుబ్బన్న గొంతులోనే కనిపించింది. దొంగతనాన్ని చేస్తూ, బయలుపడకుండా చేసుకోడానికి ప్రయత్నించే బలహీనత్వాన్ని ఆ గొంతులో నిమిషంలో కనిపెట్టేసింది మాణిక్యం. జవాబు చెప్పటానికి అసహ్యమేసింది మాణిక్యానికి.

"నిన్నే....అన్న మింకా వుడకలే?"

మాణిక్యం మాట్లాడలేదు.

"నిన్నేనే? ఏమి టా ఆలోచనా?"

పొంగివస్తూన్న ఆవేదనతో అతనికేసి చూసింది. ఆ కళ్ళని చూడలేక పోయాడు సుబ్బన్న. అతని నిలువంతా, ఒక్కసారి కంపించింది.

"ఇంకా వంటదగ్గరే వున్నావేం?" అన్నాడు బెదురుతూ, పందెం వోడిపోయిన వాడి లాగ.

"తొందరేం! పోవాల్నా....." మాట సగంలో మింగేసింది మాణిక్యం.

"పనుంది. పోవాల."

"రాచకార్యం గామాలె. అవున్లే. రాకపోతే వూరుకుంటారూ? కాపురం చేసుకునే మగాడికి బుద్ధి ఉండక్కర్లేదూ....ఛీ—"

సుబ్బన్నకి సంగతి బోధపడిపోయింది. తన తప్పు బయటపడి పోయిందని తెలుసుకున్నాడు. ఇంక తన్నుతను కాపాడుకోవాలి.

"ఎవరువారు? నువ్వనేది నాకర్థం గావటం లేదు."

"అర్థ మవుతుందీ? నువ్వు చేసేపని యెవరికీ తెలియ దను కుంటున్నావు గామాలె. లోకమంతా కోడై కూస్తోంది- సూరయ్య కూతురు—ఆ ముండ మోపిది—" మాణిక్యం వొళ్ళంతా భగ్గుమంది. సుబ్బన్న నవనాడులూ క్రుంగిపోయాయి.

"ఛండాలపు ముండ నా కాపురాని కెసరుపెట్టిందీ, సంసారం చేసుకునే మగవాడివి నీకు తెలివి ఉండక్కర్లలా? నాకు తెలియదను కున్నావా? ఇరవై రోజులనించీ పరీక్షగా చూస్తానే వున్నాను. ఇంత పాడుపని నువ్వు చేస్తావని నేననుకోలేదు. ఫో. ఆ ముండదగ్గిరికే ఫో. పాడుముండ—అన్నం వేళకి తయారవుతున్నావు యిరవై రోజుల నుంచి—పిచ్చిబొందని కనక చప్పున కనిపెట్టలేక పోయాను.—నా మొగ మెట్లా చూస్తావు, ఫో ఆ ముండ దగ్గరికి!"

సుబ్బన్నకి కోప మొచ్చింది. తన సంగతి మాణిక్యానికి తెలిసి నందుకు కాదు, మాణిక్యం దానిని తిట్టినందుకు. కాపురానికి వచ్చిన యేడేండ్ల నుంచీ ఇలాటి పరిస్థితి ఆ దంపతులకి సంభవించలేదు.ఇలాంటి సంఘటనలో ఎలా ప్రవర్తించాలో యిద్దరిలో ఎవరికీ తెలియదు. పొంగి పొర్లుతూ వుడికిస్తూన్న ఈర్ష్య మాణిక్యానిదీ, రేగివస్తూన్న కోపం సుబ్బన్నదీని.

"నోరుముయ్యి. వాళ్లపై తెలియకుండా వాగబోకు. కిట్టని ముండలు చెప్పేమాటలు విని నోటికొచ్చినట్టల్లా మాట్లాడక" అన్నాడు సుబ్బన్న.

"పాడు ముండలు చెప్పారా! నువ్వు మంచోడివి, ఆ దొంగ ముండ పతివ్రతానా?"

"ఛీ- నోరుముయ్యి!" సుబ్బన్నకి కోపం యెక్కువైంది.

"నోరు ముయ్యాలేం? నువ్విట్టాగే చేస్తావేం? పదిమందినీ తీసి కెళ్ళి, ఆ ముండకి గడ్డి పెట్టించనూ!"

సుబ్బన్నకోపం రూపం దాల్చింది. "పాడుముండా, వాళ్ళ పై తెలియడం లేదూ? దరిద్రపుముండా, నోటికొచ్చినట్టు మాట్లాడు తావ్!" అంటూ ఫెడీ ఫెడీమని నాలుగు దెబ్బలు బాదాడు. మాట్లాడ కుండా పెద్ద పెద్ద అడుగులు వేసుగుంటూ బయటికి వెళ్ళిపోయాడు.

మాణిక్యానికి ఈర్ష్యతోటి అవమానంకూడా కలిగింది. కాపు రానికి వచ్చిన యేడేళ్లనుంచీ, పల్లెత్తుమాటకూడా అని యెరుగని సుబ్బన్న యివ్వాళ చెయ్యి చేసుకున్నాడు. ఇదంతా ఆ పాడుముండే బోధపరిచి వుంటుం దనుకొంది మాణిక్యం. చక్కగా చేసుకొనే తన

కాపురానికి నీళ్ళువోస్తోంది! చూసిచూసి వూరుకోవడం యెలాగ? తనని కొట్టి ఆ ముండతో కులకటానికి పోయాడు కాబోలు. ఏం చెయ్యడానికి మాణిక్యానికి తోచిందికాదు. కొడుకును వెంటబెట్టుకొని, ఇంటికి బయటి గొళ్ళెంపెట్టి, వీరమ్మగా రింటికి పోయింది.

వీరమ్మని కావులించుకొని యేడ్చి, జరిగిన సంగతంతా చెప్పింది మాణిక్యం. తన పుట్టింటికి పోతాను సాయమెవరైనా పంప మన్నది. వీరమ్మ యిలాంటి సమస్యల్ని వొందలకొద్దీ విడదీసిన మనిషి. ఇటు వంటి పరిస్థితుల్లో యెలా ప్రవర్తించాలో వీరమ్మకి బాగా తెలుసు. ఏదో యాదాలాపంగా తను అంటించిన ముక్క యింత పని చేసింది. ఇప్పు డెవర్నైనా సాయ మిచ్చి మాణిక్యాన్ని పుట్టింటికి పంపితే వూరంతా తనను చివాట్లు పెడతారు. మాణిక్యం పుట్టిల్లు అక్కడకి బాగా ఆమడ దూరముంది. మధ్య చిన్న అడివిగూడా వుంది. రోడ్డువున్నా రాత్రి పూట ఇద్దరు ముగ్గురు మొగాళ్ళు జట్టుగా కలిసికూడా ఆ దారిని పోవ టానికి జడుస్తారు. అందుచేత యే విధాన్నచూసినా మాణిక్యాన్ని పుట్టిం టికి పంపించడం అంత సమంజసమైన పనికాదు.

"ఆలోచన చెపుతా రా" అని మాణిక్యాన్ని చెయ్యిపట్టుకొని వాళ్ళింటికే దీసుకొనిపోయింది వీరమ్మ. దారిలో "ఏదో మెల్లిగా దారికి తెచ్చుకోవాలి గాని, అలా మొగాడిమీద కోప్పడితే చిక్కు మనకే" అంటూ సర్దిచెప్పింది. వీళ్ళు ఇంటికి వెళ్ళేటప్పటికి సుబ్బన్న ఆరు బయటవేసిన మంచంమీద పడుకొని ఆలోచిస్తూ ఉన్నాడు.

"ఏమిట్రా తమ్ముడూ, మరదలిమీద చెయ్యి చేసుకున్నావుట! బిడ్డనికన్న తండ్రివి కాస్త పస్తాయించ వొద్దూ! ఆడకూతురు ఏదేనా కాస్త కటువుగా మాటాడితేమాత్రం సముదాయించుకొని పోవాలిగాని అంత తొందరపడితే యెట్లా? నలుగురూ నవ్వరూ! నిదాన ముండొద్దూ? లే. లే, అన్నం తినండి" అని వీరమ్మ తనే వాళ్ళిద్దరికీ వడ్డించి, పోట్లాడుకో వద్దనీ, నలుగురు నోళ్ళలోనూ పడొద్దనీ బోధించి, వెడు తున్నా నంటూనే రెండు గంటలు కూచుని వెళ్ళింది. అంతేకాని అసలు సంగతి యెత్తి వీరమ్మ కూడా, సుబ్బన్నని మందలించింది కాదు. దంపతులు యెడమొగం పెడమొగంగా పడుకొని నిద్రపోయారు.

నాలుగు రోజుల దాకా ఒకరి మొహం వొకరు చూసుకోలేక పోయారు. దినచర్య మాత్రం యథావిధిగా జరిగిపోతున్నది. సుబ్బన్న చేత, అతను చేసినపని తప్పు అని వొప్పించాలనీ, ఇంకెన్నడూ దాని మొహం చూడననిపించాలనీ మాణిక్యం పట్టు; నేను స్వతంత్రుణ్ణి, నా యిష్ట మొచ్చినట్టు చేస్తాను, దీని పెత్తన మేమిటని సుబ్బన్న మొండి తనం. భార్యా భర్తల పొత్తు మళ్ళీ కలిసింది కాదు. సుబ్బన్న మాత్రం యథాప్రకారం సూరయ్య కూతురి దగ్గరకు వెళ్ళడం మానలేదు. ప్రతి పూటా అన్నందినేటప్పుడు, యీ గొడవ తెచ్చి సాధింపు మొదలు పెట్టేది మాణిక్యం. విసుక్కుంటూ, తిడుతూ, అన్నమంతా విరజిమ్మి లేచిపోయేవాడు సుబ్బన్న.

మాణిక్యానికి రోజులు గడచిన కొద్దీ ఓపిక తక్కు వైంది. "దాని దగ్గరకు వెళ్ళడం మాంతావా, మానవా?" అని సుబ్బన్నని నిల దీసి అడిగి వ్యవహారం తేలుద్దామని నిశ్చయం చేసుకుంది.

రాత్రి ఎనిమిదిగంట లయింది. జోరున కురిసిన వాన అప్పుడే వెలిసింది. మబ్బువిడి ఒక్కటొక్కటే చుక్కలు కనపడుతున్నాయి. సుబ్బన్న ఇంటికి వచ్చాడు. సణుక్కుంటూ పీట వేసి, కంచు కంచంలో అన్నం పెట్టింది మాణిక్యం ఇంకా అన్నం కలపలేదు సుబ్బన్న.

"ఇదిగో చూడు, నువ్వు దాని దగ్గరకు పోవడం మాంతావా, మానవా?" అంది, మాణిక్యం. భయం తీరిపోవడంచేత మొండిబారి పోయిన సుబ్బన్నకి కోపం బాగా వచ్చింది.

"నువ్వు యింకోసారి ఆ మాట యెత్తావంటే తంతాను" అన్నాడు. ఆ దంపతులలో ఒకరు తప్పుచెయ్యడమూ, రెండో వారు సహించలేకపోవడమూ జరగడంచేత, అదివరకు వాళ్ళకి వొకరి మీద యింకొకరికి ఉండే పూజ్య భావాలు పోయినవి.

"తంతావూ? దాన్నే తీసుగొచ్చి యిక్కడ బెట్టుకో, నే నీ కొంపలో కాపురం చెయ్యను. అంత ఇష్టంలేని మొగుడితో కాపుర మేమిటి! దాన్నే బెట్టుకొని వూరేగు."

"మాధర్చోద్, పో. ఎక్కడికి పోతావో. నా యిష్ట మొచ్చినట్టూ వూరేగుతాను" అని లేచి కొట్టాడు మాణిక్యాన్ని.

"ఈ పాడుకొంపలో యింక అడుగు పెట్టను" అని, పిల్లాడిని తీసుకొని బజారులోకి వచ్చింది మాణిక్యం. జనమంతా యిళ్ళలో ఉన్నారు. ఎక్కడో తప్ప మనిషి అలికిడి లేదు. ఎక్కడికి ప్రయాణం? వీరమ్మ యింటికిపోతే మళ్ళా తనింటికే తీసుకొస్తుంది. వీరమ్మే ఏమిటి?—ఆ వూళ్ళో యెవరైనా అంతే. ఏం చెయ్యాలి? అమ్మగా రింటికిపోతే కొన్నాళ్ళకి చచ్చినట్టు సుబ్బన్న తనకోసం రాకమానడు. వచ్చిన సుబ్బన్నని నాన్నచేతా, అమ్మచేతా, తమ్ముళ్ళచేతా నాలుగూ పెట్టించవచ్చును. రాకపోతాడా?—పోనీ, అంత తన అవసరం అతడికి లేకపోతే, ఎక్కడుంటేనేం, తను? ఇదీ మాణిక్యం తేల్చు కున్న అభిప్రాయం.

ఆమడ దూరం ఒక్కత్తీ అడివిగుండా పోవడమే!

అడివీ, ఆమడ దూరమూ, అర్ధరాత్రీ- యివేవీ మాణిక్యానికి తోచ లేదు. తనని అంత తృణీకరించిన మొగుడి దగ్గరనుంచి యెంతదూరం పోతే, అంత మనశ్శాంతి కుదురుతుందనుకుంది. వెనక్కి తిరిగి ఇంటి [illegible]పు చూడటానికి కూడా ఆమెకి మనస్కరించలేదు.

ఒక్క విసురున నడక ఆరంభించింది. కొడుకు తనతో నడుస్తున్నాడు. అమ్మని నాన్న కొట్టడమూ, వాళ్ళిద్దరూ మాట మాట అనుకోవడమూ చూస్తూనే ఉన్నాడు, ఆ కుర్రాడు. తల్లితోపాటు వాడూ మాట్లాడకుండా బయలుదేరాడు, ఆవు వెంబడి దూడలాగ.

కొడుకుని వెంటబెట్టుకొని రోడ్డు మీద ప్రయాణం చేస్తోందేకాని, మాణిక్యం మనసు ప్రయాణం మీద లేదు. సుబ్బన్న యెలా దారికి వస్తాడు, తన కాపురం మళ్ళా ఎలా సరిడుతుంది- ఇదే ఆలోచన ఆమెకి.

"ఎక్కడికే అమ్మా, యింత చీకట్లోనూ!" అన్నాడు కుర్రాడు.

"అమ్మమ్మగారింటికి. దబదబా నడు, చప్పున పోదాం" అంది మాణిక్యం.

దారిపొడుగునా చెట్లమీదనుంచి వాన చినుకులు వీళ్ళ మీద పడుతున్నాయి. చెవులు గింగుమనేటట్టు కీచురాళ్ళు అరుస్తున్నాయి.

సుమారు మూడు మైళ్ళు నడిచింది మాణిక్యం. రోడ్డు మీద, పూర్వం టోలుగేటుపెట్టిన చిన్న పెంకుటిల్లు ఉంది. అక్కడికి వచ్చింది.

"ఎవరా దారినిపోయే మనిషి! ఆగూ!" అని అడివంతా దద్ద రిల్లేటట్టు పెద్ద కేక వినబడింది. మాణిక్యానికి కాలు ముందుకు సాగింది కాదు. నాలుగు వైపులా చూడటానికి మెడకూడా తిరగలేదు. నరా లన్నీ బిగుసుకుపోయాయి. నడుస్తూన్న కుర్రాడు తల్లి రెండుకాళ్లూ గట్టిగా కావులించుకున్నాడు. "అమ్మా, యేమిటే? భయ మేస్తోందే!" అన్నాడు.

"భయం లేదు, వుండు" అంది కాని, తనమాట తనకే విన బడలేదు.

ఎదురుగుండా మొద్దులాగ నల్లటి కాయపారు శరీరాలతో, చేతులలో బడితెలతో, నలుగురు మనుష్యులు ప్రత్యక్షమయారు. "ఎవరే నువ్వూ?" అన్నాడు వారిలో వొకడు. వాడి నల్లటి మొహంలో తెల్లటి పళ్ళు తళుక్కుమన్నాయి. మేఘాలు వురిమినట్టు నలుగురూ నవ్వారు.

"బాబూ, మీ బిడ్డని" అని దణ్ణం పెట్టింది మాణిక్యం.

"ఓస్, ఈ వేషాలు వెయ్యకు. ఏవూరు నీది? అది చెప్పు. ఎక్కడికి పోతున్నావు? అది చెప్పు" అన్నాడు వాడే.

"బాబూ, మీ బిడ్డని; మాది పాలెం. మా అమ్మకి ప్రాణం మీదికి వచ్చిం దని కబురు తెలిసి నేను పేటలో మా అమ్మగా రింటికి పోతున్నా. పేటలో సింగరయ్య కూతుర్ని నేను. మీకు దణ్ణం పెడతా. నన్ను పోనియ్యండి. మీ కడుపున పుడతా" అంది మాణిక్యం. వాళ్లు వొకరి మొహం వొకరు చూసుకొని యేదో గుసగుస లాడుకున్నారు.

"నాయనా, నా అన్నలు మీరు. నేను కొడుకుతల్లిని. మీ కడుపు చల్లగా నన్ను పోనియ్యండి. మీకు పుణ్యముంటుంది."

"ఏయ్, ఊరికే వాగబోకు. తొందరపడక రాయిట్లా, నీతో కొంచెం పని వుంది" అని కుర్రాణ్ణి వొకడూ, ఆమెని వొకడూ, కేక వెయ్యడానికీ, మాట్లాడడానికీ కూడా వీలులేకుండా లాక్కుని, ఆ టోలు గేటు పెంకుటింట్లోకి తీసుకుపోయారు. ఆమె గింజుకోవడం చూచి పిల్లాడు బ్యారుమన్నాడు. "మాట్లాడితే నరుకుతా" నని ఒకడు చిన్న కత్తి చూపాడు. పైకి ఏడవకుండా పిల్లాడు లోలోపలే కుమలడం

ఆరంభించాడు. "ఏయ్, మా మాట విను, నీ కేమీ చిక్కు లేదు. నీ వొంటి మీద కోటిరూపాయల నగ లున్నా మేము తాకం. చూడు——
——మా అందరి దగ్గరా ఒక్కొక్కసారి————" అన్నాడు ఆ నలుగురిలో ఒకడు.

"ఛీ, ఛీ,————మీకు అప్పచెల్లెళ్లు లేరూ?"

"అప్పచెల్లెళ్ళు వున్నారు. పెళ్ళాలు వున్నారు. వాళ్ళ వూసెత్తకు; అక్కచెల్లెళ్ళ వరసతో కాదుగా, నిన్ను మే మడిగేది. మరదలి వరసతో—"

"హి హి హి" అని తక్కిన ముగ్గురూ యికిలించారు.

"మీకు దణ్ణంపెడతా, నే నలాంటిదాన్ని కాను. న న్నొదిలెయ్యండి. మీకు పుణ్య ముంటుంది" అని వేడుకుంది మాణిక్యం.

"పుణ్యం కోసం మేము ఏడవటం లేదులే. మా మాట విను. మా పని అయిపోంగనే, మేము తోడువచ్చి నిన్ను మీ ఊళ్ళో వదలిపెడతాము. సై అను. మేమంత యాబ్రాసిగా ఉన్నామా చూడు."

"నే నలాంటిదాన్ని కాదు. నన్ను పోనియ్యండి. అలాంటి పనికి నేను వొప్పుకోను. నన్ను చీల్చినా సరే, నరికినా సరే, నన్ను ముట్టుకోనియ్యను."

"ఆలోచించుకో, కావలి స్తే నలుగురమూ నీకు కొద్దో గొప్పో ముట్టచెపుతాము. మాకు ఊరికే కోపం తెప్పించకు. నీ సిగపువ్వు రాలకుండా, పేటలో దిగ పెడతాం. ఏం? ఆలోచించుకో."

ఆమె మాట్లాడలేదు.

"ఆలోచించుకో."

"అక్కరలేదు."

"అయితే బలవంతాన చెరుస్తాము. అట్టె నీలిగావంటే...."

ఆమెకు భయమేసింది. అంతపనీ చేస్తారనీ, చెయ్యగలరనీ వాళ్ళ మొగాలే చెపుతున్నాయి. ఆలోచించుకుంది. చీకట్లో వాళ్ళ కళ్లూ పళ్లూ జిగజిగ మెరుస్తున్నాయి.

"అయితే.........నన్ను కాలుమడికి పోనియ్యండి" అంది మాణిక్యం.

"ఇదేదైనా ఎత్తు కాదుగద. ఎక్కడికిపోతావు, పోయిరా."

"నేను తలుపు వేసుకుంటాను."

"బయటికి పోయా."

"అవును."

"ఏం తెలివి చూపించావు! మమ్మల్ని లోపలపెట్టి—"

"—లేకపోతే ఎట్లా, మీ నలుగురుయెదటా ఒక్కసారి—"

"అహ్హహ్హా. సరేకాని, నీ పమిటకొంగు తలుపుసందులోనుంచి మాకియ్యి. బయట నీపని కానిచ్చుకుని మళ్ళా లోపలికి రా!"

మాణిక్యానికి మార్గాంతర మేమీ కనపడలేదు. కొడుకునుకూడా బయటికి పంపించమంటే వాళ్ళు వొప్పుకోలేదు. వాళ్ళు కోరినట్టుగానే, కొంగు వాళ్ళ కిచ్చి, తలుపు దగ్గిరగా లాగి గబుక్కున గొళ్ళెం పెట్టింది.

పదినిముషాలు—అంతా నిశ్శబ్దంగా ఉంది.

"అయిందా?" లోపల్నుంచి ప్రశ్న.

"తలుపు తియ్యి. లోపలికి వస్తావా, రావా?—"

"ఏయ్!"

చీరె, వాళ్ళు పట్టుకున్నంత మట్టుకి, చర్రున చింపేసింది. లోపల్నుంచి వాళ్ళు లాగగా, చిరిగిన తుండెం వాళ్ళని చేరుకుంది.

"మాధర్చోద్. తలుతియ్యి, నరుకుతాం—తలుపు పగలగొడ తాం....తియ్యి ఏయ్!"

వాళ్ళు తలుపు తన్నారు. ఊఁహూఁ. ఇనుప కమ్మీలతో గోడ లోకి బిగించిన తలుపు. రాతిగోడ. టోలుగేటుకోసం కట్టిన ఇల్లు కదూ!

"తీస్తావా, తియ్యవా?" అని అడిగారు.

"నీ బిడ్డణ్ణి నరుకుతున్నాం" అని బెదరించారు.

"అమ్మో, మీకు దణ్ణం పెడతా. మిమ్మల్ని యెవరికీ పట్టి యివ్వను. తెల్లవారంగానే ఒదిలేస్తా. నా బిడ్డన్ని యేం చెయ్యకండి. మీకు దణ్ణం పెడతా. మీ చెల్లెల్ని నేను" అని ఆమె బయటినుంచి ప్రార్థించింది.

"ఛీ. నోరుముయ్."

"నా బిడ్డణ్ణేం చెయ్యకండి."

అతిదీనంగా వేడింది వాళ్లని మాణిక్యం. వాళ్లకి ఆత్మరక్షణ ప్రధానమైంది యిప్పుడు. ఎలాగయినా లొంగదియ్యాలి.

"అమ్మోయ్, ఓ అమ్మా! నా కాలు కోస్తున్నారో, అమ్మో, అమ్మా, తలుపు దియ్యవే. అమ్మా, అమ్మా...." కొడుకు గొంతు.

"నాయనా!"

"బాబోయి, అమ్మా, అమ్మా!"

మాణిక్యానికి ఆలోచన పోలేదు. ఏం చేస్తుంది? ఇప్పుడు తలుపు తీసిందా, వాళ్ళు తనను చెఱపడం నిజం. తన్నడం నిజం. ఎంతేనా చేస్తారు. లేకపోతే....

"అమ్మోవ్! ఆఁ ఆఁ ఆఁ-అమ్మా!"

పిల్లాడితోటి ఏం చెపుతుంది? ఏమని ఊరడించడానికీ మాణిక్యానికి తోచలేదు.

"అమ్మా........"

అంతే. యింక ఆ కొడుకుమాటలు మాణిక్యం జన్మలో మళ్లీ వినలేదు. తల్లి పేగును చంపుకొని, కళ్ల నీరు కారుస్తూ అడివంతా దద్దరిల్లేటట్టు కేకలువేస్తూ అలా ఆ అరుగుమీదపడి దొర్లుతూ చెప్పనలవికాని బాధపడిపోతోంది. లోపలనుంచి వాళ్ళు యెంతేనా గోల చేస్తున్నారు. కాని తలుపు రాదు. మాణిక్యం తియ్యదు. రాత్రంతా యిలా వేగింది.

ప్రొద్దు పొడుస్తుండగానే అక్కడకి పదిమైళ్లలోవున్న రైలు స్టేషనుకి పేటనుంచిపోయే మోటారుబస్సు ఆ రోడ్డుమీదే మామూలు ప్రకారం వచ్చింది. బస్సుకి యెదురుగా పోయి బస్సు ఆపించి బస్సులో వాళ్లకి ఈ సమాచారం చెప్పింది మాణిక్యం. బస్సులోవున్న ఇరవై ఆరుగురు ప్రయాణీకులూ అక్కడ దిగిపోయారు. తలుపు తియ్యటానికి యెవరికీ గుండె చాలిందికాదు. బస్సు తీసుకొని, ఆరుమైళ్లలోవున్న పోలీసుస్టేషనుకి పోయి, జవాన్లనీ, యిన్‌స్పెక్టరునీ తుపాకులతోసహా తీసుకొచ్చాడు డ్రైవరు. అతికష్టంమీద ఆ నలుగురికీ బేడీలు వేశారు.

వాళ్ళు తుండేల క్రింద నరికిన ఆ బిడ్డణ్ణిచూసి అందరూ కన్నీరు కార్చారు.

* * *

పోలీసుస్టేషను లాకప్‌గది కిటికీవూచలు తొలిగించి పారిపోయి, యినస్పెక్టరు ఉద్యోగానికి ముప్పుదెచ్చినవాళ్ళు ఆ నలుగురూను. ఆ దొంగల్ని పట్టియిచ్చినందుకు మాణిక్యంమీద ఆ యినస్పెక్టరుకి కలిగిన పూజ్యభావానికి పరిమితి లేదు.

మాణిక్యం చెప్పిన కథంతా విని, అర్థంచేసుకుని సుబ్బన్నను పిలిపించి కాపురం సరిగ్గా చేసుకోలేకపోతే అరెస్టు చేస్తానని బెదిరించి, సూరయ్యని పిలిపించి, నీ కూతుర్ని కట్టుబాటులో ఉంచకపోతే డొక్క చీలుస్తానని కోపపడి, ఆ దంపతులిద్దరినీ కలిపాడు యినస్పెక్టరు.

మళ్లా పదినెలలకి మాణిక్యం మగపిల్లవాణ్ణి కన్నది. మొదటి కొడుకును బలి యిస్తేనే కాని రెండో కొడుకు పుట్టాడుకాదు, పాపం!

---

# 19. తక్కిన ఇద్దరు

నరసింహారావు ఆ ఆఫీసులో చేరి రెండు సంవత్సరా లయింది. అతి కష్టం మీద ఆ ఉద్యోగం సంపాదించాడు. ఎన్నో ఆఫీసులు తిరిగి, ఎంతోమందిని దర్శించి, నానా అవస్థలూ పడితేగాని ఆ ఉద్యోగం దొరకలేదు. బి.ఏ. ప్యాసయినా, తనకన్న తక్కువ చదువుకున్నవాళ్లు ఎక్కువ జీతం సంపాదించుకుంటూ ఉన్నా, చాలా కాలం ఉద్యోగం లేకుండా అవస్థపడి ఉండటంచేత, ఏదో ఒక ఉద్యోగంలో, ఎంతోకొంత జీతంమీద చేరితేనే కాని లాభం లేదనీ, ఒకసారి ఎక్కడో ఒకచోట చేరితే, తరవాత క్రమంగా పైకి పోవచ్చుననీ, అతడు ముప్ఫయి రూపాయిల జీతానికే—పాపం, ఆ ఉద్యోగంలో చేరాడు.